# చీకటి తెర

''ట్రెయినొక అరగంట మాత్రమే లేటట అక్కయ్యా!'' అన్నాడు వేణు స్టేషన్ మాస్టార్ రూంలోంచి ప్లాట్‌ఫాం మీద నిల్చున్న వాళ్ల అక్కయ్య శారద దగ్గరికొచ్చి.

''అయితే ఫరవాలేదురా! పదిగంటలలోపలే కొత్తగూడెం చేరుకోవచ్చు'' అంది శారద.

''పదిగంటలంటే మాత్రం.... రాత్రిపూట ఒక్కదానివి.... ఎలా వెళ్తావో యేమిటో...'' అన్నాడు నరసయ్య....శారద వాళ్ల నాన్న.

''బావగారు స్టేషన్‌కు జీపు పంపిస్తానని చెప్పాక కూడా భయమెందుకు నాన్నా!'' అన్నాడు ఇంటర్ చదువుతున్న వేణు.

''పంపిస్తానన్నాడు నిజమే! కాని రాత్రిపూట ట్రెయిన్లో ఒక్కతె కొత్తగూడెం దాకా ఎలా వెళ్తుందని నా భయం'' అన్నాడు నరసయ్య.

''మీరేం దిగులుపడకండి నాన్నా! ట్రెయిన్లో యేం భయముండదు. బోల్డుమంది. కొత్తగూడెం స్టేషనులో దిగగానే ఆయనుంటారు. మీరనవసరంగా భయపడిపోకండి'' అంది శారద.

ప్లాట్‌ఫాం మీద మంది ఎక్కువగా లేరు.

శారద దృష్టి కొంచెం దూరంగా నిల్చున్న ఇన్‌షర్ట్ వేసుకొని వారపత్రిక చదువుతున్న ఓ యువకుడి మీద పడింది. అతన్ని కాస్త పరిశీలనగా చూడగానే అతన్ని తను ఇదివరకెక్కడో చూశాననిపించింది. అతన్ని అలాగే ఇంకాస్సేపు చూడగానే అతన్ని ఎక్కడ చూసిందో ఆమెకు గుర్తొచ్చింది. వెంటనే ఆమె గుండెలు వేగంగా కొట్టుకున్నాయి.

అతడు మధుసూధన్ - ఒకసారడతడు తనను చూడటానికి పెళ్లిచూపుల కొచ్చాడు. వాళ్లది తమ పక్క ఊరే. అతడప్పుడు ఇంజనీరింగ్ పూర్తిచేసి ఉద్యోగం కోసం చూస్తున్నాడని చెప్పారు. అమ్మా, నాన్నా-అందరూ ఈ సంబంధం కుదిరితే తమకంటె అదృష్టవంతురాలు ఉండదని అనుకున్నారు. అతడు చూడటానికి చాలా బావున్నాడు. ఉన్నత చదువులు చదివాడు.

పెళ్లి చూపుల్లో చాలాసేపటివరకు అతడు తన మీదినుంచి అతని చూపుల్ని మళ్లించుకోలేకపోయాడు.

అతనికి తను నచ్చుతుందా? ఒకవేళ అతడు ఆ అమ్మాయి నాకు నచ్చిందని చెప్పినా అతని తల్లిదండ్రులు కోరినంత కట్నం నాన్నగారు ఇవ్వగల్గుతారా? కట్నంతో పన్లేదు - నేనా అమ్మాయిని తప్ప ఇంకెవర్నీ పెళ్లి చేసుకోనని మొండికేసేంత ధైర్యం అతనికుందా? ఎందుకో అతన్ని చూస్తే అతడు తన కోసం అంత ధైర్యం చేస్తాడనిపించింది. కానీ అలాంటిదేమీ జరగలేదు.

అతడు 'ఆ అమ్మాయి నచ్చిందని' చెప్పాట్ట కాని వాళ్ల నాన్న గారడిగినంత కట్నం నాన్నగారివ్వలేకపోయారు. ఆ తర్వాత ఆ అబ్బాయికి వేరే వాళ్లెవరో రెండు లక్షల కట్నమిచ్చి వాళ్లమ్మాయినిచ్చారని తెలిసింది. తర్వాత అతనికి సింగరేణి బొగ్గుగనుల్లో ఇంజనీర్‌గా ఉద్యోగం కూడా దొరికినట్టు తెలిసింది...

శారద చాలాసేపు అతన్నే చూస్తూ ఉండిపోయింది.

పెళ్లి చూపులరోజు... అంటే ఇంచుమించు రెండేళ్ల క్రితం ఎలా ఉన్నాడో ఇప్పుడూ అలాగే ఉన్నాడు.

పక్కన అతని భార్యలేదు. రెండు లక్షలతో వచ్చిన ఆ భార్య ఎలా ఉందో చూస్తే బావుండును. భార్యను పుట్టింటిలో వదిలేసి వస్తున్నాడా? లేక కొత్తగూడెంలో ఉందా? ఆమె ఎలా ఉంటుందో.... తనకన్నా అందంగా ఉంటుందా?

'అక్కయ్యా! సింగరేణి వచ్చేస్తోంది' అరిచాడు వేణు.

ప్రయాణికులు ట్రెయిునొచ్చి ఆగేటప్పటికి బిలబిలమంటూ ట్రెయిన్‌వైపు పరుగెత్తసాగారు. వాళ్లను తోసుకుంటూ వెంటనే ట్రెయినెక్కలేకపోయింది శారద.

'అక్కయ్యా! ఇక్కడ సీటుంది రావే!' అంటూ వేణు కేకేశాడు.

శారద ఆ సీటు దగ్గరకు వెళ్తుండగానే ట్రెయిన్ కదిలింది. 'ఇదిగో ఇక్కడే నీ సూట్‌కేసూ, బెడ్డింగ్ పెట్టాను' అంటూ వేణు ట్రెయిన్ దిగాడు.

'జాగ్రత్తగా వెళ్లమ్మా!' అన్నాడు నరసయ్య.

'అక్కయ్యా! టాటా!' అన్నాడు వేణు.

శారద మెల్లగా వెళ్లి తన సీట్లో కూర్చుంటుండగా ట్రెయిన్ నెక్కొండ స్టేషన్ దాటింది.

సూట్‌కేసు పైన పెట్టేసి, బెడ్డింగ్‌ను సీటు కిందకు తోసేసి, కొంచెం తేరుకుని తన చుట్టూ కూర్చున్న వాళ్లను పరిశీలనగా చూసింది శారద.

తన ముందు సీట్లోనే వారపత్రికలో తలదూర్చి కూర్చున్న మధుసూదన్‌ను చూడగానే మరోసారి ఆమె గుండెలు వేగంగా కొట్టుకున్నాయి.

కాని అతడు తనకేసి చూడటం లేదు.

అతడు బయటి ప్రపంచాన్ని పూర్తిగా మరచిపోయి చదవసాగాడు.

అతని ముందే కూర్చున్న తనను అతడు కనీసం ఒక్కసారైనా కన్నెత్తి చూడక పోవడం

ఆమెకు తల కొట్టేసినట్టుగా ఉంది.

అతడొక్కసారి... కనీసం ఒక్కసారైనా తనకేసి చూసి తనెవరో గుర్తుపడ్తే బావుండును అనుకుంది.

ట్రెయిన్ వేగాన్ని పుంజుకున్నది.

చుట్టూ దట్టంగా వ్యాపించిన చీకట్లను చీల్చుకుంటూ ట్రెయిన్ వెళ్లి పోతున్నది.

ఆ వుంగరాల జుట్టు... విశాలమైన నుదురు కొట్టొచ్చినట్టుగా నిటారుగా వున్న ముక్కు హుషారుగా వెల్గుతున్న కళ్లు పచ్చగా బంగారంలా మెరసిపోతున్న శరీరం ఎంత నాజూగ్గా వున్నాడు! ఎప్పుడూ నిక్కబొడుచుకుని ఎంత బలమైన దువ్వెన కూడా లొంగని జుట్టు, చిన్న నుదురు మధ్యలో సొట్టపడిన ముక్కు, ఎర్ర జీరలతో నిండిన కళ్లు, లావైన పెదవులు, నల్లగా మెరిసిపోయే శరీరచ్ఛాయ....ఇదీ తన భర్త రూపం! అతనికీ ఇతనికీ ఎంత తేడా? కాని మనిషి అందంగా లేకపోతేయేం? తనని ప్రేమగా చూసుకుంటాడు. పువ్వుల్లో పెట్టి పూజిస్తాడు. తనకేది కావాలంటే అది క్షణాలమీద తెచ్చిపెడ్తాడు. తనకేకాదు... తన వాళ్లందరికీ...నాన్నకు, తమ్ముళ్లకు, చెల్లెళ్లకు - అందరికీ ఎన్నో విధాల సహాయం చేశాడు. అసలు తనను అతనికిచ్చి పెళ్లి చేసినప్పట్నించీ ఆ ఇంటి దరిద్రం పోయింది. కూలిపోవడానికి సిద్ధంగా వున్న ఇంటిని మరమ్మతు చేయించి కొత్తింటిలా మార్చారు. 50వేల కట్నం ఇచ్చి తన చెల్లెలికి ఓ మంచి సంబంధం చూసి పెళ్లి చేశాడు. తన పెద్ద తమ్మునికి డొనేషన్ కట్టి కర్నాటక స్టేట్‌లోని ఓ ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీలో జాయిన్ చేయించాడు. కేవలం తన కోసం ఆయన తన కుటుంబానికి ఇన్నివిధాలుగా సహాయపడుతున్నాడు.

తను అతన్ని పెళ్లి చేసుకోవడం చాలా చిత్రంగా జరిగింది.... అతన్ని చేసుకుంటానని చెప్పినప్పుడు అందరూ తనేదో యమలోకం వెళ్లడానికి సిద్ధపడ్డట్టుగా భావించారు.

నాన్న సంతానంలో తనే పెద్దది.

చిన్ననాటినుండి నాన్నకు తనంటే ఒక ప్రత్యేకమైన ప్రేమాభిమానాలుండేవి. తను అందంగా, అమాయకంగా ఉండటమే అందుకు కారణం కావొచ్చు. బాగా చదువుకొని గొప్ప ఉద్యోగం చేస్తున్న వాడిని, తనకు తగ్గ అందం వున్నవాడిని చూసి తన పెళ్లి చెయ్యాలని నాన్న ఆశపడేవాడు. లక్షల కట్నం ఇస్తే తప్ప తనకలాంటి పెళ్లికొడుకు దొరకడు. నాన్న దగ్గర అమ్మటానికి ఏమీ లేదు. ఆ కుటుంబానికి తిండి పెట్టగల్గేంత భూమి మాత్రమే మిగిలింది. అదికూడా అమ్మితే ఆ కుటుంబం పస్తులుండవలసి వస్తుంది. అలాంటి పరిస్థితుల్లో తనను చూడటానికి ఈయన - రఘురామ్ వచ్చాడు.

రఘురామ్‌ను గూర్చి రకరకాల పుకార్లు ప్రచారంలో ఉండేవి. రఘురామ్‌కు ఇదివరకే పెళ్లయిందని, అతని భార్య చాలా అందంగా వుండేదని, ఆమెను ఇతడు అనుక్షణం రకరకాలుగా హింసిస్తుండేవాడని - చాలా క్రూరంగా ప్రవర్తించేవాడని, కొట్టేవాడని,

సిగరెట్ పీకలతో కాల్చేవాడని - అతడో పెద్ద సాడిస్ట్ అనీ... కొందరు చెప్పేవాళ్లు. మరికొందరేమో అవన్నీ కట్టుకథలనీ, రఘురామ్‌కు పెళ్లయిన మాట వాస్తవమేగానీ, ఆమె బుద్ధి మంచిది కాకపోవడం చేత ఇతడే ఆమెను వదిలేశాడని చెప్పేవాళ్లు.

అయినా తన మేనమామగారు 'రఘురాం మీరనుకున్నంత చెడ్డవాడేం కాడు. అతన్ని చేసుకుంటే మన శారద సుఖపడుతుంది. అతడు ఫారెస్ట్ రేంజర్‌గా పనిచేస్తూ బోల్డు ఆస్తి సంపాదించాడు. అతడు తన మొదటి భార్యతో ఆమె పోషణ కోసం వాళ్లడిగినంత డబ్బు ఇచ్చేసి పూర్తిగా తెగతెంపులు చేసుకున్నాడు' అని చెప్పి అమ్మనూ, నాన్ననూ ఒప్పించి అతన్ని పెళ్లి చూపులకు తీసుకొచ్చాడు.

అమ్మా, నాన్నా, మిగతా తమ బంధువులూ - అందరూ అతన్ని చేసుకోకపోవడం చేసుకోవడం పూర్తిగా తనకే వదిలేశారు. తమ బంధువుల్లో నూటికి తొంభై తొమ్మిదిమంది తను అతన్ని చేసుకోనని ఖచ్చితంగా చెప్పేస్తుందని ఊహించారు.

''నేను మీ అమ్మాయిని చేసుకుంటాను - మీరు నాకు ఒక్క పైసా కట్నం ఇవ్వాల్సిన అవసరంలేదు. నాకిదివరకే ఒకసారి పెళ్ళయిందన్న మాట నిజమే. కాని ఆ పెళ్లి విఫలమైపోయింది. ఆమెతో పూర్తిగా తెగదెంపులు చేసుకున్నాను. ఆమె బుద్ధి మంచిది కాకపోవడమే అందుకు కారణం. ఆమెను నేను కొట్టాననీ, చిత్రహింసలకు గురిచేశానని మా బంధువుల్లోనే కొందరు నేనంటే గిట్టనివాళ్లు ప్రచారం చేశారు. వాళ్లు నా గురించి ప్రచారం చేసినదంతా పచ్చి అబద్ధం. మీ అమ్మాయి నాకు నచ్చింది. ఆమెకు అభ్యంతరం లేకపోతే నేను పెళ్లి చేసుకుంటాను. ఆమెను నా ప్రాణంతో సమానంగా చూసుకుంటాను. నా మాట నమ్మండి'' అన్నాడతడు.

ఆ క్షణంలో తనకేమయ్యిందో తెలీదు. అకస్మాత్తుగా తనో నిర్ణయం తీసుకుంది. తను అతన్ని చేసుకుంటుంది. నాన్న తనకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఇంతకంటే గొప్ప సంబంధం తీసుకు రాలేడు. లోపలకెళ్లి తన మావయ్యను పిలిచి 'నేనతన్ని చేసుకుంటాన'ని చెప్పేసింది.

'అందరూ నీకేమైనా పిచ్చెక్కిందా?' అని తనను చెడామడా తిట్టేశారు. అయినా తన నిర్ణయం మారలేదు.

తనను కనీసం ఓ డజన్‌మంది ఎంతో అందమైన, ఎంతో చదువుకున్న, ఎంతో సంస్కారమున్న పెళ్లికొడుకులు చూశారు. కాని అందులో కనీసం ఒక్కరు కూడా 'ఈ అమ్మాయి నాకు నచ్చింది. నాకు కట్నంతో పనిలేదు. నేనీ అమ్మాయిని చేసుకుంటాను' అన్నవాళ్లు కనిపించలేదు. కానీ రఘురాం తనకు పైసా కట్నం అక్కర్లేదన్నాడు - తనను తన ప్రాణంతో సమానంగా చూసుకుంటానన్నాడు - దారిద్ర్యంతో కృంగిపోతున్న నాన్నగార్కి పైసా ఖర్చు కాకుండా తన పెళ్లయిపోతే ఎంతో ఉపశమనంగా ఉంటుంది.

ఆవిధంగా అతనితో తన పెళ్లయిపోయింది.

అయితే తన పెళ్లయి అతనితో కాపురం చెయ్యటం మొదలెట్టాక తన కుటుంబ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. రఘురామ్ నాన్నగార్కి ఎన్నోవిధాల సహాయ పడ్డాడు. తనను కూడా ఎంతో ప్రేమగా చూసుకున్నాడు. ఇంతకాలం తను అతన్ని గూర్చి విన్నవన్నీ వట్టి కట్టుకథలేననిపించింది.

క్రమక్రమంగా అతడెలాంటివాడో తనకర్థమైపోయింది.

అతనికి ప్రతి పనీ ముందే నిర్ణయింపబడిన ఒక ప్లాన్ ప్రకారం జరగాలి. అలా జరక్కపోతే అతడు చాలా కోపగించుకునేవాడు.

'ఈరోజు కొత్తగూడెం వెళ్లి పిక్చర్ చూద్దాం - 5 గంటలకు జీపొస్తుంది - రెడీగా ఉండాలి' అని చెప్పి వెళ్లాడొక రోజు. పక్కింటావిడ వచ్చి ఎంతసేపటికీ వెళ్లిపోకుండా యేవేవో కబుర్లు చెప్పింది. ఆమె అలా కబుర్లు చెప్తుండగానే జీపు వచ్చేసింది. అతడు వెంటనే తను అతనితో బయటికి రావడానికి సిద్ధంగా లేనని గ్రహించాడు - 'పది నిముషాల్లో తయారవుతాన'ని తను చెబుతున్నా వినిపించుకోకుండా అతడు 'రయ్యి'మని జీపు స్టార్టు చేసుకొని వెళ్లిపోయాడు. అలా వెళ్లినవాడు మళ్లీ రెండ్రోజులు దాకా ఇంటికిరాలేదు. అప్పట్నించి అతడేదన్నా ప్రోగ్రాం వేస్తే దాన్ని తు.చ తప్పకుండా ఆచరించేది.

ఈ రెండేళ్లలో తను మరో విషయం కూడా గమనించింది. అతనికి స్త్రీల విషయంలో అనుమానం కొంచెం ఎక్కువే. అందుక్కారణం అతనికి అతని మొదటి భార్యతో ఉన్న అనుభవం కావొచ్చునని సరిపెట్టుకుంది.

ఒకసారి తనూ, అతడూ హైదరాబాద్ వెళ్లారు. ఒకరోజు సాయంత్రం షాపింగ్ చేస్తుండగా ఒక షాపులో తమ ఊరతడు - గోపాల్ కనిపించాడు. గోపాల్ హైదరాబాద్‌లో యేదో ఉద్యోగం చేస్తున్నాడు. చిన్నప్పుడు తనూ, గోపాల్ ఒకే క్లాసులో చదివారు. తనతో చాలా చనువుగా వుండేవాడు. తను కనిపించగానే గోపాల్ ముఖం వెలిగిపోయింది.

'బావున్నావా శారదా' అని పలుకరించాడు.

అతనితో తాను చాలాసేపు కబుర్లలో పడిపోయింది. అతడు చేస్తున్న ఉద్యోగం గురించి అడిగింది. అతని పిల్లల్ని గూర్చి అడిగింది. అతడూ తనను గూర్చి అడిగాడు. అలా అతనితో తను ఓ పదినిముషాలసేపు మాట్లాడింది. అంతే! రఘురామ్ మూడ్ పాడైపోయింది. షాపింగ్ కాన్సిల్ చేసి లాడ్జకు బయల్దేరారు.

'బజార్లో ఎవడు కనిపిస్తే వాడితో గంటల గంటలు మాట్లాడటమేనా?' అన్నాడు లాడ్జికి వెళ్లగానే.

'ఎవరో కాదండి... అతడు మా ఊరివాడే' అని తానేదో చెప్పబోయింది. కాని అతని కోపం పోలేదు.

ఆ రోజంతా అతడు తనతో చనువుగా ఉండలేకపోయాడు. అతని కోపం పోగొట్టడానికి

తనకు రెండ్రోజులు పటిటంది.

'కాఫీ తీసుకోండి' అని ఎవరో తననే అంటున్నారని గ్రహించి ప్రస్తుతంలో కొచ్చింది శారద.

తన ముందుసీట్లో కూర్చున్న మధుసూదనం కాఫీకప్పు చేతిలో పట్టుకుని తనకందించడానికి ఎదురుచూస్తున్నాడు.

కిటికీలోంచి బయటకు చూసి ట్రెయిన్ డోర్నకల్ స్టేషన్‌లో ఆగిందని గ్రహించింది.

అతని చేతిలో వున్న కాఫీ కప్పు అందుకుని 'థాంక్స్' అంది. అయితే అతడు తనను గుర్తుపట్టాడన్నమాట! అతడు కూడా కాఫీ తాగుతున్నాడు. అతడికంటే మొదటే తను కాఫీ తాగడం పూర్తిచేసి రెండుకప్పుల కాఫీ డబ్బులు తనే ఇవ్వాలనుకుంది. కానీ కాఫీకుర్రాడు తనివ్వబోయిన డబ్బు తీసుకోలేదు. 'సార్ ఇచ్చేసిండ'ని చెప్పాడు.

ట్రెయిన్ డోర్నకల్ స్టేషన్‌నుండి కదిలింది.

టైమ్ ఎనిమిదన్నర. ఇంకో గంట సేపట్లో కొత్తగూడెం చేరుకుంటుంది.

అతడు ఈసారి ఏదో నవలలో తలదూర్చాడు.

అతడు తనను గుర్తుపట్టికూడా యేమీ మాట్లాడటం లేదని అర్థమైంది - కనీసం 'ఎక్కడకెళ్తున్నారని' అడగొచ్చుకదా! పెద్ద ఫోజు.... మాట్లాడితే తన గౌరవానికేదో భంగం కల్గుతుందన్నట్టుగా ప్రవర్తిస్తున్న అతన్ని చూస్తే ఆమెకు వళ్లు మండిపోతోంది -

త్వరగా కొత్తగూడెం వచ్చేస్తే బావుండును. తను స్టేషన్‌లో దిగగానే తన కోసం తమ డ్రైవరొచ్చి తన సూట్‌కేసూ, బెడ్డింగ్ అందుకుంటుంటే అతడు చూడాలి. తను దర్జాగా వెళ్లి జీపులో కూర్చుంటుంటే అతను చూడాలి. అతడు రిక్షాలో వెళ్తుంటే తన జీప్ అతన్ని ఓవర్‌టేక్ చేసి వెళ్తున్నప్పుడు అతని మొఖాన్ని చూడాలి. అప్పుడుగాని తన కసి తీరుతుంది. ఓ గంటసేపటివరకూ ఆమె ఆలోచనలు అలాగే పరుగెత్తాయి.

ట్రెయిన్ కొత్తగూడెం చేరేంతవరకూ అతడామెకేసి చూళ్లేదు - అందుకు అతనికెలా బుద్ధిచెప్పాలా అని ఆమె ఎన్నో విధాలుగా ఆలోచించింది.

చివరకు - ట్రెయిన్ కొత్తగూడెం స్టేషన్‌లో ఆగింది.

ప్రయాణీకులంతా హడావుడిగా దిగిపోసాగారు.

అతడు కూడా దిగాడు.

శారద తన కోసం ఎవరైనా వస్తారేమోననుకొని ప్లాట్‌ఫారంవైపు చూడసాగింది. కానీ ఎవరూ రావడం లేదు.

డ్రైవర్ జీపులోనే పడుకుని నిద్రపోతున్నాడేమో! వాడికి కొంచెం నిద్ర ఎక్కువే -

ఆమె కూర్చున్న కంపార్ట్‌మెంట్ మొత్తం ఖాళీ అయిపోయింది. అయినా తన కోసం ఎవరూ రాకపోవడం ఆమెను ఆశ్చర్యపరిచింది.

ఓ కూలీని పిలిచి తన సూట్‌కేసు, బెడ్డింగ్ స్టేషన్ బయటకు తీసుకురమ్మని చెప్పి ప్లాట్‌ఫాంమీద నడవసాగింది.

ఇప్పుడైనా తన కోసం ఎవరైనా వస్తే బాగుండును!

రఘు తనకు ఎదురుపడి ''సారీ డార్లింగ్! కొంచెం ఆలస్యమైంది!'' అంటే ఎంత బావుండును!

కానీ తన కోసం ఎవరూ రావడం లేదు.

యేదో పొరపాటు జరిగింది. ప్రతిపనీ ఎంతో జాగ్రత్తగా, ఒక ప్లాన్ ప్రకారం చేసే రఘూ ఈసారిలా ఎందుకు చేశాడు? యేదో జరిగింది. యేదన్నా ఆక్సిడెంట్ జరిగి తన రఘుకేమన్నా...

తను చాలా పిచ్చిగా ఆలోచిస్తున్నాననిపించింది.

ఇంతలో మధుసూదన్ కోసం జీపొచ్చి అతని ముందే ఆగింది. ఎందుకో అతడు వెంటనే ఆ జీపెక్కలేదు.

తనిప్పుడేంజెయ్యాలి? రిక్షాలో బస్‌స్టాండ్ దాకా వెళ్లి అక్కణ్ణించి భద్రాచలం వెళ్లిపోతే? భద్రాచలం వెళ్లాక తమింటికి వెళ్లాలంటే మరో నాలుగైదు కిలోమీటర్లు రిక్షాలో వెళ్లాలి. అర్ధరాత్రి... వంటిమీద పదితులాల బంగారం పెట్టుకొని... ఒక్కతీ ఎలా వెళుతుంది?

ఆమె కళ్లల్లో ఉవ్వెత్తున కన్నీళ్లు ఉబికి వచ్చాయి.

''మీరెక్కడికెళ్లాలి''

శారద తృళ్లిపడి పక్కకు చూసింది.

మధుసూదన్!

''భద్రాచలం వెళ్లాలి - త్వరలోనే మా జీపొస్తుంది. మీరెళ్లొచ్చు'' అందామె. అంత కష్టంలో కూడా తనలా ఎలా అనగల్గిందో ఆమె కర్థం కాలేదు.

''ట్రయినొచ్చి అరగంటైంది. ఇంక మీజీపేం వస్తుంది. మా జీపులో వెడదాం రండి'' అన్నాడతడు.

ఇంతసేపూ తనను గుర్తుపట్టనట్టుగా ఫోజు కొట్టి, ఇప్పుడేమో ఆపదలో చిక్కుకున్న ఆడపిల్లను రక్షిస్తున్నానన్న ఫోజు! ఐదు, పది, పదిహేను నిముషాలు గడిచిపోయాయి. టైమ్ పదకొండు దాటింది.

ఇక తన కోసం ఎవరూ రారు.

''ఇక మీ కోసం ఎవరూ రారు. మా ఇంటికెడదాం రండి. ఈ అర్ధరాత్రి మీరు బస్సులో భద్రాచలం వెళ్లడం కూడా అంత క్షేమం కాదు. ఈ రాత్రి మా ఇంట్లో పడుకుని రేపు పొద్దున్నే భద్రాచలం వెళ్లిపోదురుగాని'' అన్నాడు మధుసూదన్.

అతడు తన సమాధానం కోసం కూడా ఎదురుచూడకుండా 'అరే కొండయ్యా! ఈ సామాన్లు తీసుకెళ్లి జీపులో పెట్టేయ్' అని కేకేశాడు. మరుక్షణంలో వాళ్ల డ్రైవర్ పరుగెత్తుకొనివచ్చి తన సామాన్లు తీసికెళ్లి జీపులో పెట్టేశాడు.

''రండి... ఇక ఆలస్యం చేయకుండా వచ్చి జీపెక్కండి'' ఆజ్ఞాపిస్తున్నట్లుగా అన్నాడతడు.

మంత్ర ముగ్ధురాలిలా వెళ్లి జీపులో అతని పక్కనే కూర్చుంది.

జీప్ స్టార్టయింది. పదిహేను నిమిషాల్లో మధుసూదన్ క్వార్టర్ ముందు ఆగింది.

ఇప్పుడిక ఈయనగారి శ్రీమతిగార్ని చూడాలేమో! రెండు లక్షల శ్రీమతి! ఆవిడగారెంత ఫోజు కొడ్తుందో!

అదేమిటి! ఇంటికి తాళం వేసి ఉంది! ఈయనగారి శ్రీమతి లేదేమో! పుట్టింటికెళ్లిందేమో! అంటే ఈ రాత్రి అతనింట్లో తనూ అతడు మాత్రమే!

భయంకరంగా ఉరిమి పిడుగు మీద పడ్డట్టుగా తృళ్లిపడిందామె!

డ్రైవర్ వెళ్లి తాళం తీసి తలుపులు తెరిచాడు.

''రండి... లోపలకు రండి... మా మిసెస్ లేదు. ఊరెళ్లింది'' అంటూ ఇంట్లో కెళ్లాడతడు.

ఆమెకు ఆ ఇంట్లో కాలుపెడ్తుంటే యేదో పెద్దపులి గుహలో కాలుపెడ్తున్నట్టుగా అనిపించింది.

''మీరా రూమ్‌లోకెళ్లండి... లోపలబాత్‌రూం కూడా ఉంది. మొహం కడుక్కుని కాస్త రిలాక్సవ్వండి. ఈలోగా క్యారియర్ తెప్పిస్తాను'' అన్నాడతను.

''కారియర్ అక్కర్లేదు. నాకేమాత్రం కూడా ఆకలిగా లేదు'' అంటూ తనకు చూపించబడిన ఆ రూమ్‌లో కెళ్లిపోయింది.

అది వాళ్ల బెడ్ రూమ్ - డెకోలామ్ మంచాలు, ఫోమ్‌బెడ్స్, చాలా అందంగా, చాలా సౌకర్యంగా ఉందా గది.

గది తలుపులు మూసేసి బెడ్ మీదకు ఒరిగిపోయి గట్టిగా కళ్లు మూసుకుంది.

కలలో కూడా ఊహించని ప్రదేశానికొచ్చింది.

మధుసూదన్ బెడ్‌రూంలో తను!

ఈ విషయం రఘూకి తెలిస్తే... వెంటనే తనకు విడాకులిచ్చేస్తాడు. అతని మొదటి భార్యకు యే గతి పట్టిందో తనకూ అదే గతి పడ్తుంది.

ఇంతలో బయట తలుపు చప్పుడైంది.

''ఎవరు? ఏం కావాలి?'' అంది వణుకుతున్న కంఠంతో -

''కారియర్ వచ్చేసింది. కొంచెం తిని వెళ్దురుగాని రండి''

''ప్లీజ్..నన్నొదిలెయ్యండి - నాకు బొత్తిగా ఆకలిలేదు - దయచేసి బలవంతం చెయ్యకండి'' చాలా విసురుగా అందామె.

''అయితే పడుకోండి - లైటార్పేసి, లోపల్నుంచి బోల్టు పెట్టుకుని హాయిగా పడుకోండి. పొద్దున ఐదుగంటలకు మా డ్రైవర్ జీపులో తీసికెళ్లి బస్సెక్కించేస్తాడు. గుడ్నైట్'' అన్నాడతడు.

''రక్షించాడు'' అనుకుంటూ ఆ గది తలుపులు మూసేసి బోల్టు పెట్టేసింది. కాని లైటార్పెయ్యాలంటే ఆమెకు భయమేసింది. లైట్ అలాగే ఉంచేసి బెడ్మీద పడుకుంది.

ఆ గదిలో తనింకో ఐదుగంటలుండాలి తనీ రాత్రంతా ఈ మధుసూదన్ అనే ఒకప్పుడు తనను పెళ్లిచేసుకోవాలనుకున్న వ్యక్తి ఇంట్లో గడిపానని తెలిస్తే రఘు తనని క్షమిస్తాడా? క్షమించడు గాక క్షమించడు - అతనికి కోపం వస్తే చాలా పిచ్చి కోపమే వస్తుంది.

అసలు రఘురామ్ ఇలా ఎందుకు చేశాడు?

యేదో జరక్కూడందే జరిగింది... యేదో భయంకరమైన ఆక్సిడెంట్ జరిగుంటుంది. మరుక్షణంలో ఆమె కళ్లల్లో రక్తం మడుగులో కొట్టుమిట్టాడుతున్న రఘురామ్ మెదిలాడు.

ఆమె పక్కమీద అటూఇటూ దొర్లింది.

ఒక్క క్షణం కూడా ఆమె ఆలోచించకుండా ఉండలేకపోయింది. ఎప్పుడో నాలుగ్గంటల ప్రాంతంలో ఆమెకు కాస్సేపు నిద్రపట్టింది.

బయటెవరో తలుపు కొట్టగానే ఆమెకు మెలకువ వచ్చేసింది.

కిటికీలోంచి చూస్తే చీకటి తెరలన్నీ తొలగిపోయి ఉషస్సు ఉదయిస్తున్నట్టుగా అర్థమైంది.

ఆమె వెంటనే తలుపు తీసి చూస్తే బయట డ్రైవర్ కొండయ్య నిల్చొని ఉన్నాడు.

అతనితో 'ఇప్పుడే వస్తాను' అని చెప్పి బాత్రూమ్లో కెళ్లి మొఖం కడుక్కొని, జడ వేసుకొని పది నిముషాల్లో బయటకొచ్చి జీపెక్కింది.

డ్రైవర్ జీపు స్టార్ట్ చేశాడు.

''మీ సార్ నిద్రపోతున్నాడా?'' అంది శారద.

''లేదమ్మా... రాత్రి బాగా పొద్దుపోయాక సార్ వాళ్ల మామగారి దగ్గర్నుంచి ఫోనొచ్చింది. సార్ భార్య డెలివరీలో యేదో సమస్యొచ్చిందట. సార్ వెంటనే మళ్లీ సింగరేణిలోనే వరంగల్ వెళ్లిపోయారు'' అన్నాడు డ్రైవర్.

''అలాగా'' అందామె.

తన మనసు ఎంత పాపిష్టిది! మధుసూదన్ లాంటి ఇంత మంచి మనిషిని గూర్చి

యేమో ఊహించుకుని రాత్రంతా పిచ్చి టెన్షన్‌తో గడిపింది.

రఘురామ్‌కు అంతా చెప్పేస్తుంది. అతడు తన పరిస్థితిని తప్పకుండా అర్థం చేసుకుంటాడు. అర్థం చేసుకోకుండా అనుమానిస్తే అతనికంటే మొదట తనే అతనికి 'గుడ్‌బై' చెప్పేస్తుంది.

అంతసేపూ ఆమెను ఆవరించిన భయం ఇప్పుడు పూర్తిగా తొలగిపోయింది. ఆమె హృదయం చాలా తేలికపడింది.

జీప్ బస్సుస్టాండ్ చేరగానే అక్కడ ఆమెకు రఘురామ్ కనిపించాడు. శారదను చూడగానే రఘురామ్ పరుగెత్తుకుని వచ్చాడు.

''సారీ డార్లింగ్! రాత్రి దార్లో జీప్ చెడిపోయింది. దాన్ని దార్లోనే వదిలేసి మరో జీపు సంపాదించుకుని వచ్చేటప్పటికి గంట లేటయ్యింది. స్టేషన్‌కు వెళ్లి కనుక్కుంటే నిన్నెవరో తన జీపులో తీసికెళ్లారని కూలివాడు చెప్పాడు. ఎలాగైనా నువ్వు బస్టాండ్‌కే వస్తావని నాల్గింటికే వచ్చి ఇక్కడ వెయిట్ చేస్తున్నాను'' గబగబా చెప్పేశాడు రఘురామ్.

కళ్లనిండా అతన్ని చూస్తూ ఉండిపోయింది శారద.

'యేమీ ప్రమాదం జరగలేదు కదా! ఆర్ యూ ఆల్‌రైట్ డార్లింగ్'' అన్నాడు రఘురామ్ ప్రేమగా ఆమె కళ్లల్లోకి చూస్తూ -

ఏమీ మాట్లాడకుండా ఆమె నిండుగా నవ్వింది.

''ఒక్క నిముషం.... ఇప్పుడే మన జీప్ తెస్తాను''

అంటూ రఘురామ్ పరుగెత్తుతున్నట్లుగా వెళ్లి తన జీప్ స్టార్ట్ చేసి శారద పక్కనే ఆపాడు. శారద జీపెక్కింది.

కొండయ్య ఆమె సామాన్లు ఆమె జీపులో పెట్టేశాడు - రఘురామ్ కొండయ్య చేతిలో ఓ పది రూపాయల నోట్ పెట్టి...

''మీ సార్‌కు థాంక్స్ చెప్పు'' అంటూ జీప్ స్టార్ట్ చేశాడు.

జీప్ కొత్తగూడెం దాటింది.

''రాత్రి నేను ఎవరింట్లో గడిపానో తెలిస్తే...'' అంది శారద.

''ఊ... తెలిస్తే...'' అన్నాడు రఘురామ్.

''మీరు నన్ను మీ మొదటి భార్యాలా వదిలివేస్తారేమో''

అతడు గొల్లున నవ్వాడు ''ఇంపాజిబుల్''

''ఇప్పుడలాగే అంటారు... అసలు విషయం విన్నాక...''

''అసలు విషయమేమిటో చెప్పు. చెప్పేశాక యేం జరుగుతుందో చూడు...''

''అతడు మధుసూదన్... వాళ్లది మా ఊరు దగ్గరే... ఒకప్పుడు అతడు నన్ను పెళ్లి

చేసుకుంటానని వచ్చాడు - కాని వాళ్లడిగినంత కట్నం ఇవ్వలేకపోవడంవల్ల అది జరగలేదు. రాత్రి అతడు నేనొక్కత్తినే స్టేషన్‌లో బిక్కుబిక్కుమని మీ కోసం ఎదురుచూస్తుండగా చూశాడు. మా ఇంటికి రమ్మని తీసికెళ్లాడు - వాళ్లింట్లో అతడూ నేనూ తప్ప ఎవరూ లేరు - వాళ్ల భార్య పుట్టింటికెళ్లిందట''

అతడు మళ్లీ గొల్లున నవ్వి ఆమెను తన దగ్గరకు తీసుకొని ఆమె పెదవుల్ని ముద్దు పెట్టుకున్నాడు.

''మైడియర్ శారూ! ఎట్టి పరిస్థితుల్లోనూ నిన్ను అనుమానించను. నిన్ను అనుమానిస్తే నన్ను నేను అనుమానించుకోవడం లాంటిది'' అన్నాడతడు.

విశాలమైన రోడ్డుమీద సాఫీగా సాగిపోయింది వాళ్ల వాహనం. ★

స్వాతి వారపత్రిక: 28.9.1984